‘ప్రయోగాలు’ ఫలించేనా..?

- నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- కళాశాలల్లో గదులు, పరికరాల కొరత

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 2: ఇంటర్ విద్యాశాఖ నెల రోజుల ముందే ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సీసీ కెమెరాలతో పర్యవేక్షించాలని చెప్పింది. కానీ, కొన్ని కళాశాలల్లో సీసీ కెమెరాలు లేకుండానే సోమవారం పరీక్షలు ప్రారంభమవనున్నాయి. చాలా ప్రైవేట్ కళాశాలల్లో ప్రయోగాలకు సమస్యలున్నాయి. ప్రయోగాలపై సరైన అవగాహన లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. చాలా కళాశాలల్లో అసలు ప్రయోగాలకు వసతులే

కనీస పరికరాలు కరువు...

నిబంధనల ప్రకారం కళాశాల ఏర్పాటులో భాగంగా ప్రయోగశాలలు తప్పనిసరి. ఇంటర్మీడియట్‌కు భౌతిక, రసాయన, జంతు, వృక్ష శాస్త్రానికి సంబంధించిన ప్రయోగశాలలు ఉండాలి. చాలా కళాశాలల్లో ప్రయోగశాలలు లేవు. కొన్నిచోట్ల మొక్కుబడిగా మాత్రమే ఉన్నాయి. ఇంకొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల వారు రెండు కళాశాలలకు కలిపి ఒకచోట ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. ఈ కారణాలతో ప్రాక్టికల్స్‌పై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కలగడం లేదు. ప్రయోగాలు చేయకుండానే చేసినట్లుగా అత్యధిక కళాశాలల యాజమాన్యాలు రికార్డులను దసరా సెలవుల్లో రాయించాయి.

– ప్రభుత్వ కళాశాలల్లో పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం రూ.25వేలు కేటాయించింది. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, కొన్నింటిలో అసలు పరికరాలే కొనుగోలు చేయలేదు. అక్కడి విద్యార్థులు మాత్రం ప్రాక్టికల్స్ ‘సిద్ధమయ్యారు’..! ఒక కళాశాలకు విద్యార్థులు తక్కువగా ఉండడంతో, వారిని పక్కనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ సెంటర్ కేటాయించారు. కానీ, రూ.25వేలు కేటాయించింది ప్రాక్టికల్ పరీక్షల కోసమే కాదు.. విద్యార్థులు ప్రయోగాలు చేయించేందుకు కూడా కాని మధిర నియోజకవర్గంలోని కళాశాల పరికరాలు కొనుగోలు చేయలేదు. జిల్లాలో ఈసారి ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు 13,008 మంది ఉన్నారు. ఒకేషనల్‌లో ప్రథమ సంవత్సరం 2204 మంది, ద్వితీయ సంవత్సరం 2245 మంది ఉన్నారు. జనరల్‌లో ఎంపీసీలో 10389 మంది, బైపీసీలో 2619 మంది ఉన్నారు.

మూడు దశల్లో నిర్వహణ...

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను 89 కేంద్రాల్లో మూడు దశల్లో నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ కేటాయించారు. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. స్పెల్‌ను ఐదు రోజులపాటు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సోమవారం మొదలయ్యే ప్రాక్టికల్ పరీక్షలు 19వ తేదీతో ముగుస్తాయి.

ఉద్యోగ విజేతల్లో ‘ఓయూ’ విద్యార్థులే అధికం

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(ఓయూ) వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్న వారిలో ఎక్కువమంది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారే ఉంటున్నారని అక్కడి వైస్ ఛాన్స్‌లర్(వీసీ) ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఓయూ ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు, బోధిస్తున్న కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడారు. తాను వైస్ ఛాన్స్‌లర్ అయ్యాక మొదటి సారిగా ఖమ్మం అధ్యయన కేంద్రాన్ని సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కువమంది చదువుకుంటున్న అధ్యయన కేంద్రాల్లో ఖమ్మం మూడో స్థానంలో ఉందని చెప్పారు. రెగ్యులర్ విశ్వవిద్యాలయాల్లో లేని ఎమ్మెస్సీ సైకాలజీ వంటి అరుదైన కోర్సులు ఓపెన్ యూనివర్సిటీలో ఉన్నాయని అన్నారు. త్వరలోనే డిజిటల్ రిసోర్స్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్, ఒకేషనల్ కోర్సులు, డిఫెన్స్ స్టడీస్ ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఫీజు రాయితీలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు ఇతరేతర సమస్యలుంటే హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. యూనివర్సిటీ స్టూడెంట్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఓపెన్‌లో యూజీ కోర్సులు చదివిన వారికి రెగ్యులర్ పీజీ చేయాలనుకునేవారికి ప్రతిష్టాత్మక యూనివర్సిటీల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వబోతున్నట్లు చెప్పారు. కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బి.వీరన్న, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ రావులపాటి సీతారాం, డాక్టర్ లక్ష్మణరావు, సర్వేశ్వరరావు, ఎంవి.రమణ, రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఘంటా చక్రపాణి

నేటి నుంచి హరినాథబాబా జాతర

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 2 : మండల కేంద్రం తిరుమలాయపాలెంలో శ్రీ కుసుమ హరినాథబాబా జాతర సోమవారం ప్రారంభంకానున్నది. మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు కుసుమ హరినాథబాబా ఆలయం సిద్ధమైంది. సోమవారం ఉదయం నుంచి స్వామివారి ఏకనామ కీర్తనలు, భజనలు జరుగుతాయి. ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం 11:30 గంటలకు కుసుమ హరినాథబాబాల వివాహ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. వివాహ వేడుకలకు ఉత్సవ కమిటీ సభ్యులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నదానం చేయనున్నారు. 5వ తేదీ బుధవారం స్వామివారి పవళింపు సేవ జరుగుతుంది. 1951 నుంచి ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. తిరుమలాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన గోపయ్య కృష్ణుడి భక్తుడు. భక్తిభావంతో ఆయన కృష్ణావతారంలో ఉన్న శ్రీ హరినాథబాబాను ఇక్కడ నెలకొల్పారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని నిర్మించారు. గ్రామానికి చెందిన దాచెపల్లి లక్ష్మయ్య ఆలయానికి 22 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చాడు. ఆ భూమిని పూజారికి అప్పగించి స్వామివారికి నిత్యనైవేద్యం నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు ప్రతి యేటా విరాళాలు సేకరించి హరినాథబాబా వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. గ్రామం ఈ మూడ్రోజులు బంధుమిత్రులతో కళకళలాడుతుంది.

ఉత్సవాలకు సిద్ధమైన కుసుమ హరినాథబాబా ఆలయం

సండ్రపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

పెనుబల్లి, ఫిబ్రవరి 2 : సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం పెనుబల్లిలోని సీనియర్ నాయకుడు కోటగిరి సుధాకర్‌బాబు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో సత్తుపల్లిని సండ్ర అగ్రభాగాన నిలిపారని, కరోనా కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలను కాపాడారన్నారు. పెనుబల్లి– గంగదేవిపాడు బంజర బ్రిడ్జిని మంజూరు చేసిన ఘనత ఆయనది కాదా అన్నారు. ప్రతి పల్లెలో వీధులన్నీ సిమెంట్‌రోడ్లు నిర్మించింది ఆయన కాదా ఇవన్నీ కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మందడపు అశోక్‌కుమార్, కొప్పుల గోవిందరావు, టీ.వీ.రామారావు, వెలివెల పుల్లయ్య, దొడ్డ పునేని రవి, కోటమి ప్రసాద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్.కే.గౌస్, వంగా గిరిజాపతి, వేముల నరసింహారావు, పోట్లపల్లి ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసనల వెల్లువలు

ఎర్రుపాలెం : కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంరూరల్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

కారేపల్లి, ఫిబ్రవరి 2 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వివక్షపూరితంగా, కార్పొరేట్ పెట్టుబడిదారి వర్గాలకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందని నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. సీపీఐ(ఎం)కార్యాలయం నుంచి ప్రదర్శనగా కారేపల్లి బస్టాండ్ చేరుకొని బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర మాట్లాడుతూ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల పట్ల వివక్ష చూపి రాజ్యాంగ స్ఫూర్తి, ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడిచిందన్నారు. కార్యక్రమంలో రామారావు, ఏకాంబరం, వెంకటేశ్వర్లు, రవి, శోభన్, ఉపేందర్ పాల్గొన్నారు.

ముదిగొండలో..

ముదిగొండ, ఫిబ్రవరి 2 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కేంద్రం ముదిగొండలోని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. పార్టీ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడుతూ వివిధ రంగాలకు నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సామాన్య ప్రజల ఆహార భద్రతకు తగ్గింపులు కనపడుతున్నాయని అన్నారు.

మధిరలో..

మధిర, ఫిబ్రవరి 2 : మధిరలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీపీఎం ఆధ్వర్యంలో దహనం చేశారు. పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సీపీఎం నాయకులు నరసింహారావు, సైదులు, మురళి, రామ నర్సయ్య, శంకర్‌రావు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 2 : మండల కేంద్రమైన ఎర్రుపాలెం రింగ్‌సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు, మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య అన్నారు. మద్దాల ప్రభాకర్, సంజీవరావు, వెంకటరామయ్య, బసవయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొణిజర్లలో..

కొణిజర్ల, ఫిబ్రవరి 2 : మండల కేంద్రం కొణిజర్లలో సీపీఎం మండల కార్యదర్శి చెరుకుమల కుటుంబరావు అధ్యక్షతన బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు కొప్పుల కృష్ణ, తాళ్లపల్లి కృష్ణ మాట్లాడుతూ ఇది పేదల బడ్జెట్ కాదు.. పెద్ద బడ్జెట్ అన్నారు. వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, చిన్నదానయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో..

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 2 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ల ప్రయోజనాలకు పెద్ద పీట వేసినట్లు ఉందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. ఆదివారం మండలంలోని యం.వెంకటయపాలెం, కాచిరాజుగూడెం గ్రామాల్లో మాస్‌లైన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ సంపద సృష్టికర్తలైన వ్యవసాయ కూలీలు, కార్మికుల ప్రయోజనాలను ప్రభుత్వం బడ్జెట్‌లో తుంగలో తొక్కిందన్నారు. వ్యవసాయరంగానికి నామమాత్రపు కేటాయింపులు ఉన్నాయన్నారు. నాగేశ్వరారావు, వెంకటఅప్పారావు, యాదగిరి, శ్రీనివాసరావు, పుల్లయ్య, సంపత్ పాల్గొన్నారు.

‘ఉపాధిహామీ’ని ఎత్తేసేందుకు బీజేపీ కుట్ర

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 2 : మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు అన్నారు. బచ్చోడు గ్రామంలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రమజీవులకు ఉపాధి కల్పించే ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలి

రఘునాథపాలెం, ఫిబ్రవరి 2: వ్యవసాయ రంగానికి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ పెంచడం ద్వారా బలోపేతం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని పరికలబోడు తండా, మల్లేపల్లి గ్రామాల్లో ఆదివారం రైతు సంఘం గ్రామ శాఖల మహాసభల్లో మాట్లాడారు. వ్యవసాయం కోసం అప్పులు తెచ్చి పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చింతగుర్తి రెవిన్యూ గ్రామాల పరిధిలో పట్టాపాసు పుస్తకాలు రాని రైతులకు తక్షణం అందించాలని అధికారులను డిమాండ్ చేశాడు. జిల్లా ఉపాధ్యక్షుడు బాగం ప్రసాద్, నాయకులు శ్రీను, మంకీ నాయక్, ధరావత్ స్వామి, భద్ర, సురభి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు

- వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజక వర్గం పరిధిలో ఎన్నికలు
- నల్లగొండలోనే నామినేషన్ల స్వీకరణ
- ఈ నెల 10వరకు నామినేషన్ల స్వీకరణ.. 27న ఎన్నికలు
- 12 జిల్లాల్లో ఓటు వినియోగించుకోనున్న 24,905 మంది ఉపాధ్యాయులు

నల్లగొండ, ఫిబ్రవరి 2 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నల్లగొండలోని కలెక్టరేట్‌లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. వచ్చే నెల 29తో ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం పూర్తి కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గత నెల 29న షెడ్యూల్ విడుదల చేయగా నేడు నోటిఫికేషన్ జారీ చేయనుంది. నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తూ ఈ నెల 10 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలోని అభ్యర్థులు నల్లగొండలోనే నామినేషన్లు వేయనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు తీసుకోనున్నారు. ఈ నెల 11న స్క్రూట్నీ, 13న ఉపసంహరణ అనంతరం 27న పోలింగ్ నిర్వహించి మార్చి 3న ఫలితాలను లెక్కించనున్నారు. దీనికి సంబంధించి ఎన్నికల యంత్రాంగం జిల్లాలో 200 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేయగా, ఆయా పోలింగ్ కేంద్రాల్లో 24,905 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఫలితాల లెక్కింపు కూడా నల్లగొండలోనే..

పోలింగ్ అనంతరం కౌంటింగ్ కూడా నల్లగొండలోనే నిర్వహించనున్నారు. కౌంటింగ్‌కు సంబంధించి ఆర్జాలబావిలోని గిడ్డంగుల సంస్థ గోదాములో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల్లో మొత్తం 12 జిల్లాలు ఉండగా నల్లగొండ కలెక్టర్ ఆర్వోగా, ఇతర జిల్లాల కలెక్టర్లు ఏఆర్వోగా వ్యవహరించనున్నారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో 24,905 మంది ఉపాధ్యాయ ఓటర్లకుగానూ నల్లగొండలో 4,483, సూర్యాపేటలో 2,637, యాదాద్రిలో 9,21, సిద్దిపేటలో 163, జనగామలో 921, హన్మకొండలో 5,098, వరంగల్‌లో 2,225, మహబూబాబాద్‌లో 1,618, భూపాలపల్లిలో 323, ములుగులో 612, భద్రాద్రిలో 1,949, ఖమ్మంలో 3,955 మంది ఉన్నారు.

ముగిసిన మాక్ సెట్ పరీక్ష

పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 2 : మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సత్తుపల్లి, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులకు సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసెట్–2025 మాక్ పరీక్ష విజయవంతంగా ముగిసిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్య వారి సహకారంతో నేటి విద్యార్థులకు టెక్నికల్ విద్యపై అవగాహన కల్పించాలనే పట్టుదలతో ఈ మాక్ ఎంసెట్ ప్రవేశపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. మొత్తం 332 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ అనంతరం పైకోర్సులకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ బండి అన్విద, విభాగాధిపతి రామకృష్ణప్రసాద్, షేక్ యాకూబ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాంసం మార్కెట్ ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న కూరాకుల నాగభూషణం

ఖమ్మం వ్యవసాయం, పిబ్రవరి 2: గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో మంజూరైన ఇంటిగ్రేటెడ్ మాంసం మార్కెట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగర వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో తెలంగాణ యాదవ మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథి నాగభూషణం యాదవ్ మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ మాంసం మార్కెట్ ద్వారా అనేకమంది యాదవులకు ఉపాధి దొరుకుతుందన్నారు. నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది. వ్యాపార విభాగం జిల్లా అధ్యక్షుడిగా చిలకల ఆదినారాయణ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సారిక పాపారావు, గౌరవ అధ్యక్షుడిగా వీర్ల వరప్రసాద్, మరో 15 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. త్రీ టౌన్ కమిటీ అధ్యక్షుడిగా వల్లపు లింగయ్య యాదవ్, కార్యదర్శిగా నల్లబెల్లి గౌతమ్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా చెవుల శ్రీనివాస్ యాదవ్, కన్నయ్య యాదవ్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి గుమ్మా రోషయ్య, నాయకులు బారీ మల్సూర్, కోలి లింగయ్య యాదవ్, దొడ్డా నగేష్ (కార్పొరేటర్), సారిక రాము, ముత్తెబోయిన లక్ష్మీనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

వేంసూరు, ఫిబ్రవరి 2 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ, సత్తుపల్లి డివిజన్ పరిధిలో వసతిగృహాల్లో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వేంసూరు ఎస్సీ బాలుర వసతిగృహంలో ఆదివారం ప్రేరణ, భవిష్యత్ మార్గదర్శకాలపై తరగతులను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు కస్తాల సత్యనారాయణ హాజరై మాట్లాడారు. సత్తుపల్లి ఏఎస్సీ డీవో పీ.లక్ష్మీనారాయణ బాబాసాహేబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. సత్తుపల్లి డివిజన్‌లోని పదో తరగతి చదువుతున్న కారేపల్లి, కామేపల్లి, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండల విద్యార్థులు 165మంది హాజరయ్యారు. కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ సంక్షేమ అధికారి ఎండీ పీ.లక్ష్మీనారాయణ, వసతిగృహ సంక్షేమ అధికారులు సీహెచ్ కృష్ణ, బీ.వెంకటేశ్వరరావు, జీ.వేణు, పీ.కృష్ణ, కే.సుశీల, ఎస్‌కే దుర్గాబి, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

కారేపల్లి, ఫిబ్రవరి 2 : మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ ఆదివారం పర్యటించారు. ఇటీవల పేరుపల్లి మాజీ సర్పంచ్ అజ్మీరా నాగేశ్వరరావు తండ్రి లచ్చు మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. లచ్చు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కొత్తూరుతండాలో విద్యుత్‌ఘాతంతో మృతిచెందిన హాతీరాం కుటుంబాన్ని పరామర్శించి కుటుంబాన్ని మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, సక్రు, గౌసుద్దీన్, కోటేశ్వరరావు, రాము, సురేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

15లోగా పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

మంత్రి పొంగులేటి

ఖమ్మం, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): త్వరలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించిన అనంతరం విప్పలమడక గ్రామంలో ఆయన తనను కలిసిన నేతలతో ఆయన మాట్లాడారు. ఈ నెల 15లోగా ఎన్నికల నోటిఫికేషన్ రానున్నదని అన్నారు. ఇందుకు కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటి వరకు జోరుగా సాగుతున్న ఊహాగానాలకు మంత్రి వ్యాఖ్యలు ఊతమిచ్చినట్లయింది. ఈ నెల 10లోగా నోటిఫికేషన్ ఇచ్చి 15న షెడ్యూల్ ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. పంచాయతీ ఎన్నికలు మార్చి మొదటి వారంలో జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన నివేదికపై ఈ నెల 4న రాష్ట్ర క్యాబినెట్ చర్చించనుంది. 5న శాసనసభలో ఈ కులగణనకు ఆమోదం లభించనుంది. వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలు ఊతమిస్తున్నాయి. మంత్రి పొంగులేటి ప్రకటనతో అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల అంశంపై దృష్టి సారించాయి.

రేపు టెన్త్ టాలెంట్ టెస్ట్

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 2: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 4న పదోతరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష(టాలెంట్ టెస్ట్)ను జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. ఆయన ఆదివారం తమ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 100 మార్కులకు టాలెంట్ టెస్ట్ ఉంటుందన్నారు. నాయకులు శివనాయక్, వంశీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుయలాయపాలెంలో చోరీ

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 2 : తిరుమలాయపాలెం గ్రామంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిలో తిరుమలాయపాలెం పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఇంట్లో నివాసముంటున్న లింగంపల్లి ఉపేందర్ కుటుంబ సభ్యులు గత నెల 30వ తేదీన తిరుపతి వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి చేరుకున్న వారు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంటి వెనక భాగంలో తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.30 వేల బంగారం, రూ.45 వేల సిగిరేట